

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**రచనాకాలం: 2000 సంవత్సరం**

*(గత సంచిక తరువాయి)*

**విరించి కోసం** గుమ్మం బయటే నిలబడి చూస్తోంది మానసి. దగ్గరికి రాగానే అతని చేతిని పట్టుకుని నవ్వి చెప్పింది.

"ఏమ్ ఐ గ్లాడ్ టు సీయు బాయ్."

"సో ఏమ్ స్వీటీ, ఎంచక్కా తెలుగులో మాట్లాడుకుందాం ఇకనించి."

"మా అక్క నేర్పింది నాకు ఇక్కడంతా అలా అంటారని."

"మన సంగతి మీ అక్కకి చెప్పావా?"

"శుభ్రంగా."

మానసి అక్క, బావలు విరించిని ఆదరంగా ఆహ్వానించారు. వాళ్ళతోనే భోజనం చేసాడు. నలుగురు కలిసి పేకాట ఆడారు. సాయంత్రందాకా వుండి వెళ్ళాడు విరించి. టైం ఎలా గడిచిందో తెలీకుండా గడిచిపోయింది ఆ నలుగురికి. మానసి బావ విరించి గురించి రకరకాల ప్రశ్నలతో మొత్తం సమాచారం రాబట్టాడు.

విరించి వెళ్ళాక చెప్పాడు మానసితో "నీది మంచి ఛాయిస్ అమ్మలూ, హి ఈజ్ గుడ్"

అతను దొంగ రాజకీయ పునరావాసం కోసం అప్లై చేసిన సంగతి మాత్రం చెప్పలేదు మానసి. అది చట్టానికి వ్యతిరేకం కాబట్టి, ఆ విషయం ఎన్నటికీ ఎవరికీ చెప్పదలచుకోలేదు మానసి.

సోమవారం కేటి స్కూల్ కి వెళ్ళాక తన లాకర్‌లోంచి మిగిలిన కాంపోజిషన్ పుస్తకాలని తీసి ఒక్కొక్కటి దిద్దసాగింది.

ఏడో పుస్తకం రాఖేష్‌ది. అది మొత్తం చదివాక స్టన్నయినట్లుగా కూర్చుండిపోయింది కొద్దిసేపు. మరోసారి చదివింది. చిన్నగా తలని పంకించి లేచి అతని క్లాస్‌లోకి వెళ్ళి క్లాస్ తీసుకుంటున్న టీచర్ చెవిలో ఏదో చెప్పింది. వెంటనే ఆమె పాఠం ఆపింది.

కేటి రాఖేష్‌ని క్లాసులోంచి బయటికి తీసుకెళ్ళి అతని కాంపోజిషన్ బుక్‌ని చూపించి అడిగింది.

"నీవు రాసిందంతా నిజమేనా? లేక కథ రాసావా?"

"నిజమే రాసాను టీచర్."

"విరించి మీ గెస్టా?"

"అవును టీచర్."

"ఇదంతా అతను స్వయంగా చెప్పాడా? లేక ఇంకెవరయినా?"

"విరించి చెప్పాడు టీచర్. అయితే నాకు కాదు. మా నాన్నకి చెప్తూంటే విన్నాను."

"ఆ సంగతి కూడా నీ కాంపోజిషన్ చివర్లో రాసి సంతకం చేస్తావా?"

"ఎందుకు టీచర్?"

"పనుంది."

" అలాగే టీచర్. ఎక్కువ మార్కులు వేయాలి మరి."

సోమవారం ఉదయం విరించి ఐ.ఎన్.ఎస్. ఆఫీస్‌కి వెళ్ళాడు. రిచర్డ్ బ్రూక్ చిన్నగా నవ్వి చెప్పాడు విరించిని విష్ చేసాక.

"ఇలాంటి కేసు డీల్ చేయడం నాకెంతో సంతోషంగా వుంటుంది. ఇండియా నించి వచ్చే ఎక్కువ అప్లికేషన్స్ ఫాల్స్. పూర్తిగా తృప్తికరంగా వుంది నీ కేసు నాకు."

"అందుకు కారణం అన్నీ నిజాలే కాబట్టి" నవ్వాడు విరించి.

"ఇక్కడ సంతకాలు చెయ్యాలి."

కొన్ని కాగితాలు విరించి ముందు వుంచి చెప్పాడు రిచర్డ్ బ్రూక్.

"ఎక్కడ?"

"ఇక్కడ, ఇక్కడ, ఇక్కడ..."

అతని టేబుల్ మీది ఫోన్ మోగింది.

"ఎక్స్‌క్యూజ్‌మి" అని విరించికి చెప్పి రిసీవర్ అందుకున్నాడు బ్రూక్.

కేటి తర్వాత తన భర్త ఆఫీస్‌కి ఫోన్ చేసింది. రిచర్డ్ బ్రూక్ లైన్‌లోకి రాగానే కంగారుగా అడిగింది.

"నాకోసారి విరించి గురించి నీవు చెప్పావు గుర్తుందా?"

"గుర్తుంది. అయితే ఏమిటి?"

"అతనికి సిటిజన్‌షిప్ మంజూరు చేసారా?"

"లేదు. అతను ఆ కాగితం మీద సంతకం చేయబోతున్నాడు."

"వద్దు. అతని అప్లికేషన్‌లో పేర్కొన్నవన్నీ ఫాల్స్,"

"నీకెలా తెలుసు?" అడిగాడు బ్రూక్ ఆశ్చర్యంగా.

"మొన్న శుక్రవారం మా క్లాసులో ఇంటికొచ్చిన అతిథి మీద కాంపోజిషన్ రాయమన్నాను. నా స్టూడెంట్ రాఖేష్ వాళ్ళింటికి వచ్చిన విరించి గురించి రాసాడు. అతను అమెరికాని మోసగించి సిటిజన్‌షిప్‌ని ఎలా తీసుకుంటున్నాడో ఈ కథని రాఖేష్ తండ్రి దివాకర్‌కి విరించి చెపుతుండగా విన్నాడు."

ఫోన్‌లో కేటి చదివింది. పూర్తిగా, నిశ్శబ్దంగా విన్నాడు రిచర్డ్ బ్రూక్. వింటున్న కొద్దీ అతని మొహంలో రంగులు మారసాగాయి. పూర్తిగ విన్నాక చెప్పాడు.

"బ్లడీ షిట్."

"ఏమ్ ఐ ఇన్ టైం?" అడిగింది కేటి భర్తని.

"యస్. నేనా పుస్తకం కోసం వస్తున్నాను" చెప్పాడు రిచర్డ్ బ్రూక్.

రిసీవర్ పెట్టేసి విరించి ముందున్న కాగితం తీసుకుని చెప్పాడు.

"ప్లీజ్ వెయిట్. ఐ విల్ బి బేక్ సూన్."

గంటన్నర తర్వాత వచ్చాడు రిచర్డ్ బ్రూక్.

"రాఖేష్ మంచి ఇంటిలిజెంట్ కుర్రాడు కదా?" అడిగాడు బ్రూక్.

"అవును. ఆ కుర్రాడి గురించి మీకెలా తెలుసు?" అడిగాడు విరించి ఆశ్చర్యంగా.

"వాడు నా భార్య స్టూడెంట్."

"ఓ?"

"బైదిబై, నిన్ను వెంటనే ఇండియాకి డిపోర్ట్ చేస్తున్నాం."

"వాట్!?" అదిరిపడ్డాడు విరించి.

"ఎవరికయినా నువ్వు ఓ ఫోన్‌కాల్ చేసుకోవచ్చు. అది నీ హక్కు."

"అదేమిటి? నా అప్లికేషన్‌ని మీరు వెట్టింగ్ చేసారు? తృప్తిపడ్డానన్నారు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు విరించి.

"ఇండియాకి మేం డిపోర్ట్ చేసిన మీ అన్న గోపీనాథ్ నడిపిన కథ మొత్తం నాకు తెలుసు. నీ పొలిటికల్ అసైలం అప్లికేషన్‌ని మేం ఏక్సెప్ట్ చేయడానికి అనువుగా ఏమేం ప్రయత్నాలు చేసాడో, దినపత్రికల్లో నీ గురించిన ఆ వార్తలన్నీ ఎలా చోటు చేసుకున్నాయో మొత్తం వివరాలు నాకు ఇప్పుడే తెలిసాయి. నిన్ను ఐ.ఎస్.ఐ ఏజంట్లు చంపాలనుకోవడం పూర్తిగా అబద్ధం."

"కాదు. పచ్చి నిజం."

"ఆ కథంతా నువు ఎలా అల్లావో మా నోటీస్‌కి వచ్చింది. ఇన్ రైటింగ్."

"ఇన్ రైటింగ్?"

"అవును. రాఖేష్ తండ్రి దివాకర్‌కి నువు చెప్పినదంతా రాఖేష్ విన్నాడు. స్కూల్ కాంపోజిషన్‌లో ఆ మొత్తం వివరాలు రాసాడు. దాన్ని దిద్దిన వాడి టీచర్ సరిగ్గా నా భార్య కావడం నీ దురదృష్టం."

విరించి మొహం వాడిపోయింది.

నమ్మలేనట్లుగా చూసాడు విరించి. అమెరికాలో మైనర్ చెప్పేది కోర్టు త్వరగా నమ్ముతుంది.

"నువ్వింకేదయినా చెప్పేది వుందా?" అడిగాడు రిచర్డ్‌బ్రూక్ విరించిని.

"రాఖేష్ నిజంగా అలా రాస్తే అదంతా అబద్ధం. నిజమని రుజువు చేయండి చూద్దాం."

సన్నగా నవ్వాడు రిచర్డ్.

"పొలిటికల్ అసైలమ్‌లోని ప్రధాన కండిషన్ ఏమిటో తెలుసా? బర్డెన్ ఆఫ్ ప్రూఫ్ అప్లై చేసే వాళ్ళమీదే వుంటుంది. నేను కాదు. నువ్వు ప్రూవ్ చేయాలి రాఖేష్ రాసింది అబద్ధం అని."

"అది కల్పితం అని రాఖేష్ చేత చెప్పిస్తాను నేను."

"కాని నేను మొదట అతను రాసిందే నమ్ముతాను. ఆ ఏజ్ కుర్రాడు అలాంటి కథలు కల్పించలేడు. నన్ను నమ్మించలేవు. ఈ విషయంలో నన్ను నమ్మించలేనప్పుడు రాఖేష్ రాసిందానికి వ్యతిరేకంగా ప్రూవ్ చెయ్యలేనట్లే."

విరించి మొహం పాలిపోయింది.

"ఎవరికి ఫోన్ చేస్తావో చేసుకో" రిచర్డ్ బ్రూక్ ఫోన్‌ని విరించి వైపు తోసి చెప్పాడు.

విరించి వెంటనే బాధగా కళ్ళు మూసుకున్నాడు. గోపీనాథ్‌కి ఈ విషయం తెలీగానే ఎంత బాధపడతాడో స్ఫురించడంతో అంతకు రెట్టింపు బాధపడ్డాడు విరించి. తన షాంపేన్ మత్తులో నోరు జారాడని తెలిస్తే ఇంకాస్త బాధపడతాడు.

తనకోసం ఇండియానుంచి వచ్చిన మానసికి తెలిస్తే ఎంత బాధపడుతుందో.

కళ్ళు తెరిచాడు.

''బ్లడీషిట్'' అరిచాడు టేబుల్ మీద బలంగా గుద్ది.

''మీ అన్నయ్యని డిపోర్ట్ చేసింది యాదృచ్ఛికంగానే.''

''విమానం ప్రిఫర్ చేస్తావా? లేక మీ అన్నయ్యలా కార్గో షిప్పా?'' అడిగాడు రిచర్డ్ బ్రూక్ నవ్వుతూ.

ఎవరికి ఫోన్ చేయాలి? సునీతకా? మానసికా? రిసీవర్ అందుకుని విరించి మానసి అక్కయ్య ఇంటి నంబరు తిప్పాడు. ఆమె లైన్‌లోకి రాగానే క్లుప్తంగా చెప్పాడు జరిగింది.

''జోక్ చేస్తున్నావనుకున్నాను మొదట్లో. నిజంగా నిన్ను పంపించేస్తున్నారన్నమాట'' చెప్పింది మానసి బాధగా. ఆమెకి కళ్ళమ్మట నీళ్ళే తక్కువని గ్రహించాడు విరించి.

''సారీ. వెరీసారీ. తప్పంతా నాదే అలవాటు లేని మత్తులో గొప్పగా వాగాను. ఫలితం అనుభవిస్తున్నాను'' బాధగా చెప్పాడు విరించి.

''ఇంక అమెరికాలో నీవు కాలుపెట్టలేవటగా? మా బావగారన్నారు'' అడిగింది మానసి.

''అవును.''

''మేన్ ప్రపోజెస్. గాడ్ డిస్పోజెస్ అంటే ఇదే'' చెప్పాడు దివాకర్‌సింగ్ కూడా బాధగా.

''సునీత ఏది?'' అడిగాడు విరిచి.

''రాఖేష్ వల్ల ఇలా జరగడంతో నీకు మొహం చూపించలేక రాలేదు.''

''అలా అనుకోవద్దని చెప్పండి సునీతకి. గోపీకి ఈ విషయం చెప్పారా?'' అడిగాడు విరించి.

''ఫోన్ చేసి చెప్పాను. షాకింగ్ న్యూస్ అతనికిది.''

''అవును. కష్టపడి ఈ పథకం ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేశాడు. నాకు సిటిజన్‌షిప్ వస్తే ఎంతో సంతోషిచేవాడు. సునీత నన్ను చూడటానికి ఎలా ఫీలవుతోందో అంతకు ఎన్నోరెట్లు గోపీని చూడడానికి నేను ఫీల్ అవుతున్నాను.''

''నేను నీకు షాంపేన్ ఇవ్వకుండా వుండాల్సిందసలు'' నొచ్చుకున్నాడు దివాకర్.

''ఇందులో ఎవరి తప్పులేదు. నా డెస్టినీ ఇది'' చెప్పాడు విరించి.

విరించి పాస్‌పోర్ట్‌ని, ఏర్ టిక్కెట్‌ని లుఫ్తాన్సా విమానం బోర్డింగ్ పాస్‌ని తెచ్చిచ్చి చెప్పాడు రిచర్డ్ బ్రూక్.

''ప్లీజ్ ఫాలోమి టు ది ప్లేస్.''

''వెళ్ళొస్తాను'' చెప్పాడు విరించి.

''ఆ మాట మీద వుండు. ఎలాగోలా మళ్ళీరా'' చెప్పింది మానసి గద్గద స్వరంతో.

దివాకర్ బాధగా విరించితో కరచాలనం చేసి చెప్పాడు.

''గుడ్ లక్ టు యు.''

''ఐ విల్ బి ఇన్ టచ్ వయా ఇ - మెయిల్'' చెప్పాడు విరించి మానసితో.

స్వల్పంగా ఆమె కళ్ళు తడి అయ్యాయి.

''నేను తిరిగి ఇండియాకి త్వరలో వచ్చేస్తాను. నీకోసమేగా ఈ దేశం వచ్చింది'' చెప్పింది మానసి.

రిచర్డ్ బ్రూక్, మరి ఇద్దరు ఐ.ఎన్.ఎస్ ఆఫీసర్ల వెంట కదిలాడు విరించి. అతన్ని విమానంలోని సీట్లో కూర్చోబెట్టారు. విమానం కదిలేదాకా వుండివెళ్ళిపోయారు వాళ్ళు.

మధ్యలో ఆగి బాంబే చేరుకుని ఆ విమానంలోని విరించి కిటికీలోంచి కిందకి చూసాడు. అమెరికా భూభాగం దాటి అది పసిఫిక్ మహాసముద్రం మీద ఎగరడం చూశాడు.

అమెరికా భూభాగం కనపడేదాకా చూస్తూనే వున్నాడు. కొద్దిసేపటికి ఎయిర్ హోస్టెస్ మినియేచర్ స్కాచ్ విస్కీ పెగ్ సీసాని, డిస్‌పోజబుల్ గ్లాస్‌ని, సోడా కేన్‌ని విరించి పక్కసీటతనికిచ్చింది. తర్వాత విరిచిని అడిగింది.

"ఉడ్ యూ లైక్ ఇన్?"

"వద్దు. ఈ రోజు నించి నేనిక ఆల్కాహాల్ డ్రింక్స్ తాగను. కాఫీ చాలు."

సీటుకి చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు. తను అమెరికాలో వుండి, మానసిని వివాహం చేసుకుంటే ఎంత అద్భుతమైన జీవితం అనుభవించేవాడు. వద్దనుకున్నా గుర్తుకురాసాగింది. అది అతనికి బాధ, కోపం ఒకేసారి ముంచుకురాసాగాయి.

అయితే కొద్దిసేపట్లోనే ఆ డిప్రెషన్‌లోంచి బయటపడ్డాడు.

ఓటమి గెలుపుకి మొదటి మెట్టు అనుకోగానే అతనికి కొంత ఊరట కలిగింది.

## 17

విరించి భయపడినట్టుగా గోపీనాథ్ పెద్ద అప్‌సెట్ కాలేదు. అతను అమెరికానించి డిపోర్ట్ చేయబడటం చాలా కేజువల్‌గా తీసుకున్నాడు. విరించి ఓ రోజు అడిగాడు గోపీనాథ్‌ని ఆ విషయం గురించి.

"నేను పెద్దగా అప్‌సెట్ కాకపోవడానికి కారణం వుంది. నా పథకం ఎక్కడయినా దెబ్బతిని అందులో అపజయం కలిగితే అప్‌సెట్ అయ్యేవాడ్ని. కాని నా ప్లాన్ పూర్తిగా విజయం కాబట్టి నో బేడ్ ఫీలింగ్స్. అంతేకాదు, దీనివల్ల ఐ.ఎన్.ఎస్ వాళ్ళకి నా ప్లాన్ నా మేధస్సు తెలిసింది కాబట్టి నాకింకా హేపీగా వుంది. నిజానికి నీకు సిటిజన్‌షిప్ వచ్చాక జరిగింది వాళ్ళకి ఫోన్‌లో తెలియచేద్దామనుకున్నాను. ఆ తర్వాత వాళ్ళు తామెలా మోసపోయారో తెలుసుకుని అవమానంగా ఫీలవడం తప్ప ఇంకేం చేయలేకపోయేవారు."

విరించి ఓ కంప్యూటర్ ట్రెయినింగ్ సెంటర్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా చేరాడు. కొత్తవాళ్ళకి ఇంటర్‌నెట్‌లోకి ఎలా వెళ్ళాలి? బ్రౌజింగ్ గురించి, ఇ - మెయిల్స్ పంపడం, రిసీవ్ చేసుకోవడం, సెర్చ్ ఇంజన్స్ ఎలా ఉపయోగించాలి మొదలయినవి బోధిస్తున్నాడు.

రోజుకు మూడుసార్లు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అమెరికాలోని మానసికి ఇ - మెయిల్స్ ఇస్తున్నాడు. ఆమెనించి జవాబులు వస్తున్నాయి.

విరించి ఇండియాకి చేరుకున్న పదహారో రోజు ఓ మెయిల్ ఇచ్చాడు.

డియర్ మానసి!

నేనిక అక్కడికి రాలేను. నాకోసం నిన్ను వెనక్కి రమ్మనమనను. కాబట్టి బహుశ మనవి కలవని రైలుపట్టాలలాంటి జీవితాలేమో!

ఆలోచించు. నీ జవాబెలాంటిదైనా నేను బాధపడను. నిర్మొహమాటంగా వుండు ఈ వ్యవహారంలో. నువ్వు నాకోసం వెనక్కి తిరిగిరాకుండా ఇంకెవర్నయినా అక్కడి వాళ్ళనే చేసుకుని వుండు.

ఆ ఉత్తరానికి మానసి నించి జవాబు రాలేదు.

"మనకి నీళ్ళు, నిద్ర దేముడు రాసిపెడతాడట. ఏ ఊళ్ళో నీళ్ళు మనకి ప్రాప్తమో అక్కడే తాగుతాం. అలాగే నిద్ర కూడా. వాటినిబట్టి ఆ ఊళ్ళల్లో ఆ సమయాల్లో వుంటాం. అమెరికాలో దేముడు ఎన్నిరోజులు నీళ్ళు, నిద్ర ప్రాప్తమని నీ నుదుట రాసాడో అన్ని రోజులు వుండివచ్చావు" చెప్పింది విరించికి మాలతి ఓ రోజు మాటల్లో.

విరించి ఏం మాట్లాడలేదు. అతను దేముడ్ని పెద్దగా నమ్మడు.

"ఏమో ఎవరికి తెలుసు? కొంత గేప్ తర్వాత దేముడు మళ్ళీ విరించికి అమెరికాలో నీళ్ళు, నిద్ర రాసాడేమో?" చెప్పాడు అరుణాచలం.

"నాకయితే అలాంటి నమ్మకం లేదు. ఇంక ఈ జన్మకి నాకు ఏ రకం వీసా రాదు" చెప్పాడు విరించి నిస్పృహగా.

"దేముడు తలచుకుంటే జరగలేనిదంటూ ఏదీ వుండదు" చెప్పింది విరించి తల్లి.

"అంతా ఆ సాయి దయ. ఒకవేళ నువ్వు ఎప్పటికైనా అమెరికా వెళ్ళే ఛాన్స్ మళ్ళీ వస్తే షిర్డీ వస్తానని సాయికి మొక్కుకో" సలహా ఇచ్చాడు అరుణాచలం.

"ఊర్కో నాన్నా. సాయిలేడు, గీయిలేడు" విసుక్కున్నాడు గోపీనాథ్.

విరించి కొన్ని క్షణాలు ఆలోచించాడు. తర్వాత చెప్పాడు.

"సర్లే నాన్నా. నేను మళ్ళీ అమెరికాకి వెళ్ళడం సంభవిస్తే అలాగే షిరిడీకి వెళ్ళి సాయికి నమస్కారం చేస్తాను."

"చూస్తూండయితే - సాయి మహిమ నీకు తెలుస్తుంది" చెప్పాడాయన రెండు చేతులు జోడించి సాయిబాబా బొమ్మవున్న కేలండర్‌కి నమస్కరించి కాన్ఫిడెన్స్‌గా.

డోర్‌మీద ఎవరో టకటక పెన్‌తో కొట్టి అరిచారు బయటనించి.

"కొరియర్ సార్."

అరుణాచలం వెళ్ళి సంతకం చేసి డి.హెచ్.ఎల్ కంపెనీ అతను తెచ్చిన కొరియర్‌ని తీసుకున్నాడు.

"ఎవరికి?" అడిగింది మాలతి భర్తని.

"విరించికి."

విరించి దాన్నందుకుని చింపి చదివాడు. వెంటనే మొహం విప్పారింది.

క్షణాల్లో అతని మొహం నిండా దట్టమైన చిరునవ్వు చోటుచేసుకుంది.

"చూడండి. నిజమేనా?" గోపీనాథ్‌కి ఆ లెటర్ అందించాడు, అదేదో నమ్మశక్యం కాని విషయం అన్నట్లుగా.

గోపీనాథ్ దాన్ని చదివి ఎగిరిగంతేశాడు. ఆనందంగా విరించి భుజం మీద చరిచి చెప్పాడు -

"కంగ్రాచ్యులేషన్స్. నువ్వు వెంటనే షిరిడీకి వెళ్ళిరావాలి."

మాలతి అడిగింది ఆత్రంగా.

"ఏమిటా కాగితం? ఎక్కడినించి?"

"న్యూఢిల్లీలోని అమెరికన్ ఎంబసి నుంచి. మన విరించి గొప్ప అదృష్టజాతకుడు. ఇదివరకు విరించి అమెరికన్ సిటిజన్‌షిప్ లాటరీకి అప్లై చేసాడు. గుర్తుందా?" అడిగాడు గోపీనాథ్.

గుర్తుందన్నట్లుగా తలూపాడు గోపీనాథ్ తండ్రి.

"విరించికి ఆ లాటరీ తగిలింది. అతనికి సిటిజన్‌షిప్ ఇస్తున్నట్లుగా, వచ్చేనెల ఆరో తారీకులోగా రావలిసిందిగా లెటర్."

వెంటనే అందరి మొహాలు ఆనందంతో విప్పారాయి.

"కానీ ఐ.ఎన్.ఎస్ వాళ్ళు వెనక్కి పంపారుగా. నాకది బ్లాక్‌మార్క్ కాదా?" అనుమానంగా అడిగాడు విరించి.

"కాదు. ఎలాంటి కండిషన్స్‌కి లోబడకుండా ఆఫర్ చేసిన లాటరి స్కీమ్ అది. అమెరికాకి అక్రమంగా ప్రవేశించి అక్కడ జీవిస్తున్న వాళ్ళు కూడా ఇందులో పాల్గొనవచ్చు. డిపోర్టెడ్ వాళ్ళు అప్లై చేయకూడదన్న నియమం లేదు" వివరించాడు గోపినాథ్.

"అంతేకాదు. ఇది అప్లై చేసేనాటికి నువ్వు డిపోర్ట్ కాలేదు కూడా" ధైర్యం చెప్పాడు అరుణాచలం.

విరించి మర్నాడు మద్రాసుకి బయలుదేరాడు. అమెరికాలోని కన్సులేట్ ఆఫీసర్‌కి ఆ లెటర్‌ని చూపించి తనేం చేయాలో అడిగాడు.

"మీ వెంట పాస్‌పోర్ట్ తెచ్చారా?" అడిగాడు అతను వెంటనే.

తల వూపాడు విరించి.

"అయితే వీసా ఫీజ్ డి.డి తీసుకురండి. మీకు వీసా ఇస్తాం."

డి.డితో రాగానే వాళ్ళు విరించి ఇచ్చిన పాస్‌పోర్ట్ మీద మల్టిపుల్ ఎంట్రీ వీసాని ఎంబాస్ చేశారు.

"కంగ్రాట్స్. సౌత్ ఇండియా మొత్తంలో ఇది వచ్చింది ఒక్క నీకే" చెప్పాడాయన.

తర్వాత పాస్‌పోర్టులో విరించిని డిపోర్ట్ చేసిన చేసిన వివరాలు చదివి మళ్ళీ చెప్పాడాయన.

"డబుల్ కంగ్రాట్స్"

విరించి మద్రాసు నించి హైదరాబాద్ రాగానే అదే రాత్రి షిరిడీ వెళ్ళి సాయిబాబాని దర్శించుకుని వచ్చాడు.

విరించి బంధుమిత్రులందరికీ తెలిసిపోయింది. విరించికి వచ్చిన అవకాశం గురించి దినపత్రికల జర్నలిస్టులు, ఈ టివి, జెమిని ఛానల్స్ కెమెరాలతో వచ్చి ఇంటర్వ్యూ చేశాయి.

ఆరో తారీకు దాకా ఆగకుండా పదిరోజులు ముందే బయలుదేరాడు విరించి అమెరికాకి. మానసికిచ్చిన ఆఖరి ఇ - మెయిల్ లో కూడా తను ముప్పై ఆరుగంటల్లో అమెరికాలో వుంటానని చెప్పలేదు విరించి. ఆమె తనని అమెరికా నేలమీద ఎలా సర్‌ప్రయిజ్ యివ్వాలనుకున్నాడు విరించి.

అప్పటికే మానసికి శాన్‌ఫ్రాన్సిస్కో బాంబేకి ఏర్ టిక్కెట్ బుక్కయిపోయింది.

## 18

విరించి ఎంతో ఉత్సాహంగా విమానం దిగాడు. శాన్‌ఫ్రాన్సిస్‌కో అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగీ దిగగానే ఇంకా కస్టమ్స్ క్లియరెన్స్ కాకుండా మానసికి ఫోన్ చేయకుండా వుండలేకపోయాడు.

అవతలి వైపు రిసీవర్ ఎత్తాక చెప్పాడు విరించి తెలుగులో.

"మానసితో ఒకసారి మాట్లాడాలి."

"మీరెవరు?"

"విరించిని."

"మానసి బావగారి తమ్ముడ్ని. మా అన్నయ్య, వదినలు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళారు మానసిని దింపడానికి."

"ఎక్కడికి వెళుతోంది మానసి?"

"ఇండియాకి."

"వాట్? ఎక్కడికి?"

"ఇండియాకి."

"ఎప్పుడు?"

"ఇంకో రెండు గంటల్లో" కొద్ది క్షణాలాగి అడిగాడు మళ్ళీ.

"ఎన్నింటికి ఫ్లయిట్?"

"మూడున్నరకి."

"నంబరు?"

మానసి ఫ్లైట్ నెంబరు చెప్పగానే రిసీవర్ని క్రెడిల్ మీద వుంచి గోడ గడియారం వంక చూశాడు.

రెండూ నలభై అయిదు.

గబగబా కస్టమ్స్ క్లియరెన్స్ చేసుకుని తన బాగ్ కోసం కూడా చూడకుండా వేగంగా డిపార్చర్ లాంజ్‌కి చేరుకున్నాడు. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేల్లో చూశాడు. ఆ లుఫ్తాన్సా ఫ్లైట్ లాస్ట్ బోర్డింగు కాల్ కూడా అయిపోయింది. టేకాఫ్‌కి సిద్ధంగా వుంది.

లుఫ్తాన్సా కౌంటర్‌కి వెళ్ళి చెప్పాడు.

"బాంబేకి బయలుదేరే విమానంలో మానసి అనే ప్రయాణీకురాలు వుంది. ఆమెకి ఇండియా నుంచి విరించి వచ్చాడన్న మెసేజ్ పంపాలి. ఆ సంగతి తెలిస్తే ఆమె ప్రయాణం రద్దు చేసుకుంటుంది."

"ఐ యామ్ సారీ సర్. విమానం డోర్స్ కూడా క్లోజ్ అయాయి. ఇక ఇప్పుడేం చెయ్యలేము."

"ప్లీజ్ ఇట్స్ ఇంపార్టెంట్."

"సారీ సర్. ఐ కాంట్ హెల్ప్ యు ఎనీవే."

"విమానం ఇంకా టేకాఫ్ కాలేదుగా? దయచేసి మెసేజ్ పాస్ చేయండి చాలు. ఇందుకు ఖర్చేమీకాదుగా?" విరించి కంఠంలోని బాధ, వేడికోలు ఆమె మనసుని సున్నితంగా స్పృశించాయి.

ఆమె ఫోన్ అందుకుని ఓ నెంబర్ డయల్ చేసి విషయం చెప్పింది. తర్వాత రిసీవర్ పెట్టేసి చెప్పింది.

"విమానం గాలిలో వుంది."

"ఛ! సర్‌ప్రైజ్ కోసం తను వస్తున్న సంగతి దాచి వుంచకుండా వుండాల్సింది. మానసి మాత్రం తనకెందుకు తెలియజేయలేదు ఇండియా వస్తున్నానని? బహుశా తనలాగే సర్‌ప్రైజ్ చేయాలని చెప్పి వుండదు."

అమెరికాకు విమానంలో కలలు కంటూ ఆనందంగా వచ్చిన విరించికి ఒక్కసారిగా మనసంతా దిగులుతో నిండిపోయింది. మళ్ళీ ఎప్పటికి వస్తుందో. అసలు ఆమె పేరేంటి? ఇంకోసారి పంపుతారో లేదో?

తిరిగి ఎరైవల్స్ లాంజ్‌కి వెళ్ళాడు. అతని రెండు పెట్టెలు మాత్రమే వున్నాయి బ్యాగేజి క్లైమ్ దగ్గర. వాటి టాక్స్ యిచ్చి ఈ రెండు సూట్‌కేసులని తీసుకుని బయటకు వచ్చాడు. టాక్సీ కోసం చూస్తున్న విరించి ముందు ఆగింది ఓ కారు. డ్రైవింగ్ సీట్లోని మానసి బావ పిలిచాడు.

"హలో విరించి. అమెరికాకి స్వాగతం."

"హలో! మానసి వెళ్ళిపోయిందా?" దిగులుగా అడిగాడు.

ఆయన ప్రయాణికుడి వైపు తలుపు తెరచి చెప్పాడు.

"ముందు కారెక్కు."

విరించి ముందు సీట్లో ఎక్కి అతని పక్కన కూర్చున్నాక చెప్పాడు మానసి బావ.

"ముందుగా చెప్పలేదే నువ్వొస్తున్నట్టు."

"మానసి ఇండియా బయలుదేరుతుందని నేను ఊహిస్తేగా? సర్ ప్రైజ్ చేద్దామని ఇన్‌ఫామ్ చేయలేదు."

"నేనూ అంతే."

మానసి కంఠం విని, గిరుక్కున తలను వెనక్కు తిప్పి చూశాడు విరించి. వెనక సీట్లో కూర్చుని ఆనందంగా నవ్వుతున్న మానసి కనబడింది.

"అరె! నీవు విమానం ఎక్కలేదా?" అడిగాడు ఆశ్చర్యానందాలతో.

"ఎక్కాము. మళ్ళీ నీకోసం దిగాను కూడా."

"నీకెలా తెలుసు నేను వస్తున్నానని?" అడిగాడు విరించి అదే ఆశ్చర్యంతో."

"నీ ఫోన్‌కాల్ రాగానే మా బావగారి తమ్ముడు సెల్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆయన వెంటనే లుఫ్తాన్సా పర్సనల్‌తో మాట్లాడి విమానంలో వున్న నాకు కబురు చెప్పాడు. అప్పటికింక్ డోర్ క్లోజ్ చేయలేదు. వెంటనే దిగేశాను."

"బ్యాగేజి ఎక్కించేశారు కాబట్టి యింక దింపే టైము లేకపోయింది" చెప్పాడు మానసి బావ నవ్వుతూ.

"అంటే ఆ బ్యాగేజి యిప్పుడు ఇండియా వెళుతుందా?" అడిగాడు విరించి.

"అవును. బాంబే నుంచి వాటిని మళ్ళీ వెనక్కి తెప్పించటానికి డాలర్స్ కట్టాము" వెనకనించి చెప్పింది మానసి.

"ఐ యామ్ సో హేపీ. విరించి మానసి చాచిన చేతిని ఆప్యాయంగా అందుకుని చెప్పాడు.

"నార్త్ ఇండియాలో హిందీలో ఒక సామెత వుంది. ఎవరిని ఎప్పుడు ఎక్కడ వుంచాలో అక్కడ వుంచితే మనం అలా వుంటాం అంతే. ఇందులో మన గొప్పతనం ఏమిలేదు" చెప్పాడు మానసి బావ.

## 19

శాన్‌ఫ్రాన్సిస్కో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ నిర్వహించిన నేచురలైజేషన్ కార్యక్రమానికి హాజరయ్యాడు విరించి.

ఓ విశాలమైన ఎయిర్ కండిషన్డ్ భవంతిలో ఉదయం తొమ్మిదిన్నరకల్లా తనకి కేటాయించిన సీటు నెంబరులో కూర్చున్నాడు విరించి. అతనిలానే మరికొన్ని వందలమంది హాజరయ్యారు. ముందు పాటలు పాడారు. తర్వాత ఓపెనింగ్ సెర్మని జరిగింది. ఆ తర్వాత ప్రెజంటేషన్స్ ఆఫ్ కలర్స్, తదనంతరం అమెరికన్ నేషనల్ ఏంథమ్ పాడారు.

'ది స్టార్ స్పేంగిల్డ్ బేనర్'గా పిలవబడే ఫ్రాన్సిస్ స్కాట్స్ రాసిన ఆ జాతీయగీతాన్ని, తమకిచ్చిన కవరులోని కాగితంలో ముద్రించిన ఆ జాతీయగీతం చూస్తూ చాలామంది పాడారు.

ఓ సే, కెన్ యూసీ, బై ది డాన్స్ వర్లీ లైట్, వాట్ సో ప్రౌడ్లీ.

విరించికి ఆ పాట రాదు. ట్యూన్ అంతకన్నా రాదు. కాబట్టి వాళ్ళతో గొంతు కలపలేకపోయాడు.

..ఓవర్ ది లేండ్ ఆఫ్ ది ఫ్రీ అండ్ ది హోమ్ ఆఫ్ ది బ్రేవ్?

జాతీయగీతం అయ్యాక ఆ ఆడిటోరియంలో స్టేజిమీద కుర్చీలో కూర్చుని జడ్జి 'వోత్ ఆఫ్ ఎలిజియన్స్'ని ఎడ్మినిస్టర్ చేయడానికి డైరెక్షన్ యిచ్చాడు.

ఆ హాల్లో అమెరికన్ సిటిజనేషిప్ తీసుకోడానికి సమావేశం అయిన తొమ్మిది వందల యాభై నలుగురు లేచి నిలబడి స్పీకరులోంచి వినిపించే వోత్‌ని ముక్తకంఠంతో రిపీట్ చేశారు.

"సో హెల్ప్ మీ గాడ్" అన్న ఆఖరి వాక్యం విరించి చెప్పాక అతను ఎంతో ఎమోషనల్‌గా ఫీలయ్యాడు. ప్రపంచంలోనే అగ్రరాజ్యం అయిన అమెరికా తనదిప్పుడు. తను ఆ దేశ పౌరుడయ్యాడు.

అతనికి తెలియకుండానే అతని కళ్ళవెంట కన్నీరు కారాయి. అవి దుఃఖంతో వచ్చినవి కావు. ఆ హాల్లోని దాదాపు అందరి మానసిక స్థితులు విరించి మానసిక స్థితిలానే వుండటంతో చాలామందికి కన్నీళ్ళు వచ్చాయి.

విరించి పక్కన కూర్చున్న సిటిజన్ విరించితో కరచాలనం చేసి చెప్పాడు.

"కంగ్రాట్స్"

ఆ ఆడిటోరియంలోకి ప్రవేశించిన జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగస్తులు నిముషాల్లో ప్రతి కొత్త పౌరుడి చేతిలో ఓ కవరు వుంచారు. ఆ కవరులో ఫ్రమ్ అడ్రస్ స్థానంలో "వైట్ హౌస్" అని వుంది. ఆ తెల్ల కవరుమీద్ అఫ్ మెసేజ్ ఫ్రమ్ ద ప్రెసిడెంట్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్, అని ముద్రించి వుంది. బిల్‌క్లింటన్ సంతకం చేసిన కంగ్రాట్స్ తెల్పే ప్రింటెడ్ మాటర్ వుంది ఆ కవరులోని లెటర్‌లో.

ఆ తర్వాత కార్యక్రమంలో గ్రీటింగ్ న్యూ సిటిజన్స్‌ని ఉద్దేశించి జడ్జి అడ్రస్సు ఇతర స్పీకర్స్ స్పీచ్. ఆ తర్వాత అందరిచేత ప్లెడ్ ఆఫ్ ఎల్లోజియన్స్ చెప్పించారు.

అంతా బయటకు వచ్చాక అక్కడ వున్న వారి బంధుమిత్రులను కౌగిలించుకుని కరచాలనం చేసి ముద్దులు పెట్టుకుని తమ హర్షాన్ని ప్రకటిస్తున్నారు. ఓ కొరియన్ అమ్మాయి ఆనందంతో నవ్వుతూ కొత్తగా అమెరికన్ పౌరుడయిన తన భర్తతో అంటోంది.

"నేను కొరియన్‌ని వివాహం చేసుకున్నాను. ఇలా అమెరికన్ భర్తతో కాపురం చేయాల్సి వస్తోంది."

"డార్లింగ్. ఇట్స్ అడల్టరీ బట్ ఐ పరిమిట్ యూ" నవ్వుతూ చెపుతున్నాడు అతని భార్యతో.

విరించి కళ్ళు మానసి కోసం వెతికాయి. విరించి వెతుకుతున్న మానసి కళ్ళు అతని కళ్ళను కలుసుకున్నాయి.

"హాయ్ యాంకీ అమెరికన్" పలకరించింది దగ్గరికి వచ్చి.

అకస్మాత్తుగా విరించి మానసి నడుం చుట్టూతా తన కుడిచేతిని, ఆమె వీపు మీద వేసి తనకు అదుముకుని ఏం జరుగుతోందో ఆమెకు అర్థమయ్యేలోగా ఆమె పెదవులమీద గాఢంగా చుంబించాడు.

"యస్. ఐ యామ్ యాంకీ. ఐ యామ్ అమెరికన్ నౌ."

మానసి అతన్ని ఆశ్చర్యపరిచేలా తిరిగి అలాగే ముద్దు పెట్టుకుని చెప్పింది.

"ఇన్ దిస్ కంట్రీ ఇట్స్ ప్రాపర్ టు కిస్ ఏన్ అమెరికన్ ఫియాన్సి."

**( సమాప్తం)**

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**